క్లుప్తంగా

అభ్యుదయ కవి పితామహుడు గురజాడ



కాకుమాను: అభ్యుదయ కవి పితామహుడు గురజాడ అప్పారావు అని విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పటపూడి రమేష్‌బాబు అన్నారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ గురజాడ రచనలు విశేష ఆదరణ పొందాయని తెలిపారు. సమాజంలో మహిళల పట్ల నెలకొని ఉన్న వివక్షను గురజాడ రచనల ద్వారా లోకానికి తెలియజేశారని, ఆయన రచనలకు కవిశేఖర బిరుదు పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.వెంకట శివరావు, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, రాజేంద్ర, భువనేశ్వరి, లక్ష్మి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

రంతిదేవికి డాక్టరేట్ ప్రదానం



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ పరిశోధకురాలు రంతిదేవికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. ఎడ్యుకేషన్ విభాగ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ బి.శ్రీలత పర్యవేక్షణలో 'పర్సనాలిటీ ట్రెయిట్స్, అడ్జస్ట్‌మెంట్ అండ్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని అన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



కొండపాటూరు(కాకుమాను): ప్రతి ఒక్కరు ఒక మొక్కనాటి దానిని సంరక్షించాలని అప్పుడే గ్రామాలలో పర్యావరణం లోపించకుండా ఉంటుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కొండపాటూరులో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ప్రధాని జన్మదినం పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సేవే మా ధ్యేయం-సమాజమే మా దేవాలయం అనే నినాదంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, కాకుమాను మండల అధ్యక్షుడు యడ్లపాటి శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతులు మెరుగుపరచాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ



చేబ్రోలు: జగనన్న కాలనీలో వసతులు మెరుగుపరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెం జగనన్న కాలనీలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆదివారం సీపీఎం కమిటీ సభ్యులు ఇంటింటికి తిరిగి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 540 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ, నేటి వరకు రోడ్లు, కాలువలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలో సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో 7 బోర్లు మాత్రమే ఉండడం వల్ల నీటి పంపిణీ సక్రమంగా లేదన్నారు. జగనన్న కాలనీలోని ఇళ్లపై కూటమి పభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందని అన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమంతరావు, మస్తాన్ వలి, తులసి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆగిన నిర్మాణం.. సేవలకు గ్రహణం

- ప్రభుత్వ భవనాలపై నిర్లక్ష్యపు నీడలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవన నిర్మాణాలు
- ఎన్నికలు రావడంతో ఆగిపోయిన పనులు
- ఏడాదిన్నర దాటినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం



నంబూరులో కంప చెట్లు మొలిచి నిలిచిపోయిన సచివాలయ నిర్మాణం

పెదకాకాని: ప్రభుత్వ పౌర సేవలను గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటకు చేర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పలు సేవలను అందించారు. సచివాలయ భవనాలకు నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని భవనాల నిర్మాణం నిలిచిపోయింది. అనంతరం ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం సచివాలయ భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. ప్రారంభించిన సచివాలయాలను సైతం మూతవేస్తున్నారు. దీంతో సచివాలయాల భవనాలు పూర్తయి సేవలు అందుబాటులోకి వస్తాయో రావో తెలియని సందిగ్ధం నెలకొని సచివాలయాల సేవలకు గ్రహణం పట్టింది.

నిర్మాణాలకు గ్రహణం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాకారం దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల నాటికి పలు గ్రామాలలో సచివాలయాలు పూర్తయి వినియోగంలోకి రాగా పలు గ్రామాలలో నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఎన్నికల కోడ్ రావటంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో సచివాలయ భవన నిర్మాణాలకు గ్రహణం పట్టింది. కొన్నిచోట్ల ప్రారంభమయిన సచివాలయాలను సైతం మూసివేస్తుంది.



వెనిగండ్లలో మూతపడ్డ సచివాలయం



పెదకాకానిలో ప్రారంభోత్సవానికి నోచుకోని సచివాలయం

మండలంలో 19 సచివాలయాలు

సచివాలయ భవన నిర్మాణాలపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. అన్ని హంగులతో పరిపాలనా సౌలభ్యం కోసం విశాలమైన గదులతో నిర్మించేందుకు ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.43.60 లక్షలు కేటాయించింది. పెదకాకాని మండలానికి 19 సచివాలయాలు మంజూరయ్యాయి. వాటిలో 13 సచివాలయాల నిర్మాణం పూర్తి కాగా 5 సచివాలయాలు వివిధ దశల్లో ఉన్నాయి. వెంకటకృష్ణాపురం సచివాలయం ఆరంభ దశలోనే నిలిచిపోయింది. వెనిగండ్లలో కొద్దిరోజులు విధులు నిర్వహించిన సచివాలయాన్ని మూసివేశారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి



లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వినియోగించి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రజా అవసరాలకు వినియోగించాలి. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయకపోవడంతో ప్రజలు చాలా నష్టపోతారు. ప్రభుత్వం ఏదైనా కావచ్చు. ప్రభుత్వం ద్వారా నిర్మించిన భవనాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎం.మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పెదకాకాని

ప్రజాధనం వృథా



సచివాలయ భవనాల నిర్మాణం పట్టించుకోకుండా వదిలేయడం ప్రజాధనం వృథా చేయడమే అవుతుంది. ఒక్కో భవనానికి లక్షల్లో డబ్బులు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలను మధ్యలో వదిలేస్తే ప్రజలే నష్టపోయేది. ఇప్పటికైనా నిర్మాణ దశలో ఉన్న భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే ప్రజలకు ఉపయోగపడుతుంది.

– జి.పాములరెడ్డి, నంబూరు

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న డాక్టర్ వేముల ప్రియాంక

చేబ్రోలు: ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదలతో విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని పలువురు వక్తలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం నారాకోడూరు, మందపాడు, ఇనిమెళ్లలోని సీఎంఎస్ హోమ్‌లో పదవ తరగతి చదివి 2024–25 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు నారాకోడూరులోని సీఎంఎస్ హోమ్‌లో ఆదివారం తెనాలికి చెందిన క్రిస్టియన్ స్కూల్ పూర్వ విద్యార్థి, రైల్వే ఉద్యోగి లాలం సాగర్ బాబు ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ మండవ శ్రీనివాసరావు, కడప మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కూచిపూడి రాకేష్, తెనాలి నందులపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక, హైకోర్టు న్యాయవాది పెరికల దానియల్, చరం గ్లోబల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఏవీ సాంబశివరావులు మాట్లాడుతూ కలలు సాకారం చేసుకోవాలంటే సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉందంటూ తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో సీఎంఎస్ హాస్టల్ మేనేజర్ కె.రమేష్, అందె బాలచంద్రమౌళి, మైలా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం గాలికి వదిలేసింది

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రక్షణ గాలికి వదిలేసి ప్రభుత్వ ఆస్తులను అమ్ముకోవటంలో బిజీగా ఉందని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రావిపాటివారిపాలెం గ్రామానికి చెందిన చిన్నారులను ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులు, స్థానికంగా ఉన్న గ్రామ ప్రజలతో మాట్లాడారు. వారికి న్యాయం చేసే వరకూ పోరాడతానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు నిత్యం జరుగతూనే ఉన్నాయని, మహిళలకు రక్షణ కరువైందన్నారు. చిన్నారులపై వాసిమళ్ల శ్యామ్యూల్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించినా కనీసం నియోజకవర్గ ఎమ్మెల్యేకు చీమ కుట్టినట్టయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రజల ఇబ్బందులను పట్టించుకోలేని ఎమ్మెల్యే ఉన్నా.. లేకున్నా ఒకటేనన్నారు. ప్రజల గోడు పట్టించుకోని ఎమ్మెల్యే నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి కొమ్ముకాస్తున్నాడా అని ప్రశ్నించారు. చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవటం గానీ, బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు గానీ ఎమ్మెల్యేకు సమయం లేకపోవటం చూస్తే కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు పేదలు, ప్రజలంటే ఎంత చిన్నచూపో అర్థమవుతుందన్నారు. మహిళలు, ముక్కు పచ్చలారని చిన్నారులపై సైతం అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల రక్షణ గాలికి వదిలేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్యకర్తలకు పరామర్శ



చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని నారాకోడూరు, కొత్తరెడ్డిపాలెం, యడ్లపాటి నగర్ తదితర ప్రాంతాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదివారం పరామర్శించారు. కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ యన్నా రాజశేఖరరెడ్డి కుమారుడు యన్నా వాసుదేవారెడ్డి మంగళగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వాసుదేవారెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని, కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. యడ్లపాటి నగర్‌కు చెందిన షేక్ చోటు అనారోగ్యానికి గురవటంతో పరామర్శిచి ధైర్యం చెప్పారు. నారాకోడూరు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కోడూరు ప్రసాద్ మృతి చెందటంతో మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆళ్ల శ్రీరామిరెడ్డి పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పైకి ఎక్కి వ్యక్తి నిరసన



గుంటూరు రూరల్: తన ఆస్తిని కాజేస్తున్నారని గోరంట్ల అన్నపూర్ణనగర్‌కు చెందిన వ్యక్తి ఓ బిల్డింగ్‌పైకి ఎక్కి ఆందోళన చేసిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు తన ఆస్తిని కాజేసే కుట్ర పన్నుతున్నారని, అదేమని అడిగితే బెదిరిస్తున్నారని అన్నపూర్ణనగర్‌కు చెందిన వీరాంజనేయులు అనే వ్యక్తి బిల్డింగ్‌పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. దీంతో స్థానికులు కలుగజేసుకుని వీరాంజనేయులును బిల్డింగ్ పై నుంచి కిందకు దించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించామని స్థానికులు తెలిపారు.

చంపేస్తామని బెదిరిస్తున్న ఘటనపై కేసు నమోదు

గుంటూరు రూరల్: తన ఆస్తిని కొడుకు, వియ్యంకులు రాయించుకుని.. చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితుడి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం అమరావతి రోడ్డు నగరాలుకు చెందిన బూసిరాజు వెంకటరావు ఇస్త్రీ పని చేసుకుని జీవిస్తుంటాడు. అతని కుమారుడు బూసిరాజు కోటేశ్వరరావు, కోడలు అనూష, వియ్యంకులు నేరెళ్ళ సురేష్, నేరెళ్ళ మాధవి, కుమారుడి బావమరిది నేరెళ్ళ ప్రేమ్‌లు వెంకటరావు బాకీలు చెల్లిస్తామని.. ఆస్తిని వారి పేర్లపై రాయించుకుని మోసం చేశారని, బాకీలు చెల్లించకుండా అతనిపై దాడికి పాల్పడ్డారని, అదేమని ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాహు కేతు పూజలకు పోటెత్తిన భక్తులు



పెదకాకాని శివాలయంలో రాహు కేతువులు



రాహు కేతు పూజల్లో భక్తులు

పెదకాకాని: మహాలయ అమావాస్య ఆదివారం సందర్భంగా శివాలయంలో రాహు కేతు పూజలకు అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలోని రాహు కేతు పూజల్లో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు 1,341 టికెట్లు భక్తులకు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ.6,70,500 ఆదాయం సమకూరిందన్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాహు కేతు పూజలతో పాటు ఆలయంలో అభిషేక పూజలు, అన్నప్రాసనలు, తలనీలాలు, వాహన పూజలు, అంతరాలయ దర్శనాలు, చెవిపోగులు తదితర ఇతర సేవల ద్వారా ఒక్కరోజులో స్వామి వారికి రూ.8,00,000 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఇంటింటి ప్రచారంలో తహసీల్దారు శ్రీనివాస శర్మ, ఎంపీడీవో ఊహారాణి తదితరులు

చేబ్రోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆర్‌ఎంపీల దగ్గరకు వెళ్లవలసిన అవసరం లేదని ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని చేబ్రోలు తహసీల్దారు కే శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సీజనల్ వ్యాధులపై ప్రభుత్వ శాఖల అధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశము, ర్యాలీ, ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, ఎంపీడీవో టీ ఊహారాణిలు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వైద్య ఆరోగ్య శాఖ సూచనలను పాటించాలని కోరారు. కొత్తరెడ్డిపాలెం ప్రధాన, అంతర్గత వీధుల్లో తిరుగుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు రోజు అయినా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వర్షాకాల వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశాలు, గ్రామ వీధుల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పీహెచ్‌సీ వైద్యులు యు.ఊర్మిళ, శైలజ, కే శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవి శరన్నవరాత్రులు



పార్వతీదేవి

ప్రత్తిపాడు: దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రత్తిపాడులో నేటి నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రత్తిపాడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్–2 పరిధిలోని గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయం, వేణుగోపాల స్వామి దేవాలయంలో సెప్టెంబరు 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కన్నుల పండువగా వేడుకలు జరగనున్నాయి. దేవి శరన్నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు దేవదాయ శాఖ ఈవో శివకోటేశ్వరరావు తెలిపారు.

గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో...

ప్రత్తిపాడులోని గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో 22వ తేదీన రజిత కవచాలంకృత పార్వతీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 23న బాలాత్రిపురసుందరి దేవిగా, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయని దేవి, 26న మహాలక్ష్మి, 27న శ్రీ రాజరాజేశ్వరి, 28న చండీదేవి, 29న సరస్వతిగా, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్ధినిగా, 2న పుష్పశయన అలంకరణలో దర్శనమివ్వనున్నారు.

వేణుగోపాలస్వామి దేవాలయంలో...

వేణుగోపాలస్వామి, సీతారామస్వామి వార్ల దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రులు వైభవంగా జరగనున్నాయి. 22వ తేదీన మహాలక్ష్మి అలంకారంలో, 23న గజలక్ష్మి, 24న అన్నపూర్ణదేవి, 25న మంగళగౌరి, 26న లలితాదేవి, 27న చండీదేవి, 28న కాత్యాయనీ దేవి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్ధినిగా, 2న పుష్పశయన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు.

పుట్టలమ్మతల్లి ఆలయంలో...

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామాల ఇలవేల్పు ఘంటాలమ్మతల్లి, పుట్టలమ్మ తల్లి దేవస్థానాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రాంబాబుశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న అమ్మవారు బాల త్రిపురసుందరిదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 23న గాయత్రిదేవిగా, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మి, 27న లలితాత్రిపురసుందరిదేవి, 28న మహాచండీ, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీన మహిషాసురమర్ధినిదేవి, 2న రాజరాజేశ్వరిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు ఆలయంలో చండీ హోమాలు, ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపను పొందాలని ఆకాంక్షించారు.

మెట్లు దిగుతూ జారిపడి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన ఘర్షణలో మెట్లు దిగుతూ జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ప్రకారం గుంటూరురూరల్ మండలం లాల్‌పురం గ్రామానికి చెందిన షేక్ బాజీకి సుమారు 20 సంవత్సరాల కిందట సైదులుతో వివాహమయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు. సైదులు కిడ్నీ వ్యాధితో 15 కిందట మరణించాడు. అనంతరం బాజీకి ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రేగల బ్రహ్మయ్యతో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం సహజీవనానికి దారితీసింది. బాజీ తన ఇద్దరు కుమారులు, బ్రహ్మయ్యతో కలిసి ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలో ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటుంది. నాలుగేళ్ల క్రితం అదే గ్రామంలోని జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని జీవిస్తున్నారు. గత కొంత కాలంగా బ్రహ్మయ్య మద్యం తాగి బాజీతో గొడవపడటం, అసభ్యకరంగా మాట్లాడటంతో, విసిగివేసారిన బాజీ పిల్లలు పెద్దవాళ్లు అవుతున్నారని, ఇంటికి రావద్దని బ్రహ్మయ్యకు పెద్ద మనుషులతో చెప్పించింది. దీంతో బ్రహ్మయ్య నెల రోజులుగా తన స్వగ్రామం గనికపూడిలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన మద్యం తాగి బాజీ ఇంటికి వెళ్లిన బ్రహ్మయ్య ఇంట్లో ఉన్న తన దుస్తులు ఇవ్వమని కోరగా, బాజీ ఇవ్వడం జరిగింది. ఆక్రోశానికి గురైన బ్రహ్మయ్య ఇది నా ఇల్లు.. మీరు ఉండటానికి వీల్లేదని బాజీతో గొడవకు దిగి, తన వెంట తెచ్చుకున్న కత్తితో బాజీపై దాడి చేశాడు. తల్లిపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాజీ పెద్ద కుమారుడికి కూడా గాయాలయ్యాయి. బాజీ కుమారులిద్దరూ బ్రహ్మయ్యని అదుపు చేసే ప్రయత్నంలో జరిగిన పెనుగులాటలో బ్రహ్మయ్యకు కూడా గాయాలయ్యాయి. కాపాడమని బాజీ పెద్దగా కేకలు వేయడంతో.. బ్రహ్మయ్య ఇంటి మెట్లు దిగుతూ జారి పడి మృతి చెందాడు. రక్తపు మడుగులో పడి ఉన్న తల్లి బాజీని కుమారులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. బాజీ కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర జట్టుకు 'మున్సిపల్' విద్యార్థులు

తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలోని రేవేంద్రపాడులో శనివారం జరిగిన అండర్–17 బాలుర, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్లో 9వ తరగతి విద్యార్థులు లీల నాగేంద్రబాబు, దమ్ము తేజ, బాలికల విభాగంలో పాలపర్తి హేమంబ్రర లక్ష్మీప్రసన్న ఉన్నారని హైస్కూలు హెచ్‌ఎం కె.భారతి తెలియజేశారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన అభినందించారు

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు: ఈ నెల 23వ తేదీ నుంచి 26 వరకు ఆధార్ అప్‌డేట్‌కు పట్టణంలోని పలు వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23, 24 తేదీలలో 26వ వార్డు గాజులపాలెం, 8వ వార్డు క్యాబిన్‌పేట, 31వ వార్డు సాంబశివనగర్, 18వ వార్డు టీచర్స్ కాలనీ సచివాలయాల్లో, 25, 26 తేదీలలో 25వ వార్డు ఎస్సీ, ఎస్టీ కాలనీ, 13వ వార్డు జయభారతరెడ్డి, 31వ వార్డు సాంబశివనగర్(2), 18వ వార్డు టీచర్స్ కాలనీ(2) సచివాలయాల్లో ఆధార్ సేవలు పొందాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ప్రస్తుతం డయేరియా ఎక్కువగా వ్యాపిస్తున్న కారణంగా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. 08643–247737 నంబరుకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.